క్లుప్తంగా

సకాలంలో సరుకుల పంపిణీ



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

పుత్తూరు: పేద ప్రజలకు సకాలంలో నిత్యావసర సరుకులు అందజేయాలని జిల్లా కలెక్టర్ ధ్యాన్‌చంద్ర అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం పుత్తూరు పట్టణంలోని సివిల్ సప్లయిస్ గోడౌన్‌ను తనిఖీ చేశారు. జూలై నెలకు సంబంధించిన సరుకు నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. సరుకుల పంపిణీకి సంబంధించి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, గోడౌన్ డీటీ విష్ణురాజు, ఇన్‌చార్జి ఆర్‌ఐ గురుస్వామి పాల్గొన్నారు.

వైద్యాధికారులు సమయపాలన పాటించాలి

కార్వేటినగరం: విధి నిర్వహణలో వైద్యాధికారులు సమయపాలన పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ అన్నారు. సీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని అందిన సమాచార మేరకు శుక్రవారం ఎమ్మెల్యే వీఎం థామస్ వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాత్రి పూట విధులకు డుమ్మాకొడితే సహించబోమని, విధు నిర్వహణలో తప్పక సమయపాలన పాటించాలని ఆదేశించారు.

ఉపాధ్యాయులకు ఆదర్శం గుర్రప్ప



గుర్రప్ప దంపతులకు సన్మానం

కార్వేటినగరం: ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయుడు గుర్రప్ప అని మండల విద్యాశాఖ అధికారి ఎం.విజయకుమార్ అన్నారు. శుక్రవారం కేఎం పురం ఉన్నత పాఠశాలలో గుర్రప్ప పదవీ విరమణ కార్యక్రమాన్ని ఆ పాఠశాల హెచ్‌ఎం డి.సునీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు బాబయ్య, మనోజ్‌కుమార్, తిరుమలరాజు, రవిశంకర్, శ్రీదేవి, హెచ్‌ఎంలు కేశవులు, హేమాద్రినాయుడు, మధుసూదన్‌రెడ్డి, గోవిందయ్య, ఎస్ఎస్ నాయుడు, సర్పంచ్ వెంకటేష్, మాజీ సర్పంచ్ విజయులురెడ్డి, ఉపాధ్యాయులు దైవశిఖామణి, చంద్ర, దాము, రాబర్ట్ పాల్గొన్నారు.

జూలై 1న రూ.7 వేల పెన్షన్ పంపిణీ

నగరి : జూలై ఒకటవ తేదీ ఉదయం 6 గంటలకు రూ.7 వేల ఎన్‌టీఆర్ పెన్షన్ పంపిణీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.4 వేల పెన్షన్‌తో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలల పెన్షన్ బకాయి కలిపి రూ.7 వేలు చెల్లిస్తామని పేర్కొన్నారు. వికలాంగులు, మల్టీ డిఫార్మిటీ లెప్రసీ ఉన్న వారికి రూ.6 వేలు, పక్షవాతం, ప్రమాదాల కారణంగా కుర్చీకి పరిమితమైన వారికి రూ.15 వేలు, కిడ్నీ బాధితులు, కాలేయం, గుండె మార్పిడి డయాలసిస్ రోగులకు రూ.10 వేలు, అభయహస్తం వారికి ఇదివరలో ఇచ్చే రూ.500 పెన్షన్ అందజేస్తామని వెల్లడించారు. సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీలో పాల్గొంటారని తెలిపారు.

నాగాలమ్మకు ప్రత్యేక పూజలు



మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

పాలసముద్రం: ఏటుకూరిపల్లె గ్రామంలో వెలసిన రుద్రనాగమ్మకు, తమిళనాడు సరిహద్దుల్లోని అతిమాంజేరిపేట గ్రామంలో వెలసి నాగాలమ్మకు శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. నాగాలమ్మకు మహిళలు వివిధ అభిషేకాలు చేసి, పూల మాల వేసి పసుపు, కుంకుమ పెట్టి సుందరంగా అలంకరించారు. నాగాలమ్మకు సమీపంలోని పుట్టలో పాలు పోసి, గుడ్లు పెట్టారు. అనంతరం కర్పూరం వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.


సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జిగా శ్రీనివాసులురెడ్డి



గంగాధర నెల్లూరు: మండల సింగిల్ విండో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి అధికారిగా చిత్తూరు సబ్ డివిజనల్ కో–ఆపరేటివ్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ గా పనిచేస్తున్న శ్రీనివాసులురెడ్డిని జిల్లా అధికారులు నియమించారు. శుక్రవారం ఉదయం గంగాధర నెల్లూరు సింగిల్ విండో సొసైటీలో పర్సన్ ఇన్‌చార్జిగా శ్రీనివాసులురెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

కంది సాగుకు ఇదే అదును





రైతులు సాగు చేసిన కంది పంట (ఇన్‌సెట్) లేత ఆకులు గుడ్లు, గింజలు తినే పురుగు

పాలసముద్రం: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా కంది సాగు చేసుకోవచ్చని వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలకు జూన్, జూలై నెలల్లో సాధారణంగా కంది పంటను సాగు చేస్తారు. సరైన వర్షపాతం లేకపోవడంతో ప్రస్తుతం ఆగస్టు, సెప్టెంబర్ నెలలో మండలంలో 986 హెక్టార్లలో ప్రత్యామ్నాయంగా కంది సాగు చేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. ప్రత్యామ్నాయ పంటగా కంది సాగుకు ఇదే అనువైన సమయం. విత్తనం ఎంపిక, ఎరువుల యాజమాన్యంలో కొద్దిపాటి మెళకువలు పాటిస్తే గణనీయంగా లాభాలు గడించవచ్చు.

- **విత్తన రకాలు:** పల్నాడు ఎల్‌ఆర్‌జీ 30, ఎల్‌ఆర్‌జీ 38, ఎల్‌ఆర్‌జీ 66, ఎంఆర్‌జీ 66, డబ్ల్యూఆర్‌జీ 27, డబ్ల్యూర్‌జీ 53, సూర్య(ఎంఆర్‌జీ1004) వంటి రకాల కంది సాగు చేసుకోవచ్చు.
- **విత్తే విధానం:** ఎకరాకు 6 నుంచి 8 కిలోలు విత్తనాలను విత్తుకోవాలి. అయితే తొలకరిలోలా కాకుండా ఈ నెలలో విత్తేటప్పుడు సాళ్ల మధ్య దూరం తగ్గించి 40–80–10 సెంటీమీటర్ల దూరంలో విత్తుకోవాలి.

ఎరువుల యాజమాన్యం:
ఎకరానికి సుమారు రెండు టన్నులు పశువుల ఎరువు వాడాలి. ఇలా చేస్తే భూమి భౌతికశక్తి పెరుగుతుంది. భూసారాన్ని దీర్ఘకాలం కాపాడుకోవచ్చు. సూక్ష్మధాతులో చేసి సవరించుకోవచ్చు. ఎకరానికి 16 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వారం చొప్పున దుక్కిలో వేయాలి. భూసారాన్ని సింగిల్ సూపర్ ఫాస్పేట్ రూపంలో అందిస్తే మొక్కకు గంధకం కూడా అంది దిగుబడి 20–25 శాతం పెరుగుతుంది. విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు ఎకరాకు లీటరు నుంచి 1.5 లీటర్ల పెండిమిథాలిన్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

తెగుళ్ల నివారణ:
కందికి వివిధ దశలలో నష్టం కలగజేసే చీడపీడలు వ్యాపిస్తాయి. వీటిలో మారుకా మచ్చల పురుగు, ఎండు తెగులు ప్రధానమైనవి. సెప్టెంబర్‌లో వేసినప్పుడు డిసెంబర్, జనవరి నెలలో పూతకు వస్తుంది కాబట్టి శనగ పచ్చ పురుగు ఉధృతి తక్కువ చేయడానికి మందులు పిచికారి చేయాలి.



ఢిల్లీప్రసాద్

మారుకా వచ్చల పురుగు:
తల్లి పురుగు పూమొగ్గలు, లేత ఆకులు, పిందెలపై 2నుంచి 15 గుడ్లు పెడుతుంది. గుడ్ల నుంచి నాలుగైదు రోజుల్లో పిల్లలు బయటకు వస్తాయి. ఇవి మొగ్గ, పూత, పిందె దశల్లో ఆశించి ఎక్కువ నష్టం కలుగజేస్తాయి. ప్రతి దశలో పూలను గూడుగా చేసి లోపలి పదార్థాలను తింటుంది. కాయలు తయారయ్యేటప్పుడు వాటిని దగ్గరకు చేర్చుతాయి. అలా దగ్గరగా చేర్చిన కాయలకు గూడు కట్టి రంధ్రం చేసి లోపలికి పోయి గింజలను తింటాయి.

పురుగుల నివారణ: మారుకా మచ్చల పురుగు నివారణకు పూతకు ముందే ఐదు శాతం వేపగింజల కషాయాన్ని లీటర్ నీటితో 2.5 మిల్లీలీటర్లు, క్లోరోపైరీఫాస్ లేదా ఒక గ్రాము ఎసిఫేట్ లేదా 2.5 మిల్లీలీటర్ల క్వినాల్‌ఫాస్‌తో కలిపి పిచికారి చేయాలి. ఈ మందులతో పాటుగా డైక్లోరోఫాస్ మందును మిల్లీ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు స్పైనోసాడ్ 0.4 మిల్లీలీటర్లు లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు. ఫ్లూబెండా మైడ్ 0.15 మిల్లీలీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఎండు తెగులు: ఈ తెగులు సోకిన మొక్కలు పూర్తిగా కాని మొక్కలో కొంత భాగం కాని వాడి ఎండిపోతాయి. ఎండిన మొక్కలను పీకి కాండం మొదలు భాగం చీల్చి పరిశీలిస్తే గోధుమ వర్ణపు నిలువు చారలు కనిపిస్తాయి.

మాక్రోఫోమినా ఎండుతెగులు: ముదురు మొక్కల కాండం పైన నూలు కండె ఆకారం కలిగిన ముదురు గోధుమ వర్ణపు మచ్చలు కనిపిస్తాయి. ఈ మచ్చ చుట్టూ గోధుమ వర్ణం, మధ్య భాగం తెలుపు వర్ణంలో ఉంటాయి. ఈ తెగులు సోకిన మొక్కలు ఎండిపోతాయి. ఒక్కొక్కప్పుడు కొన్ని కొమ్మలు మాత్రమే ఎండిపోతాయి.

- **నివారణ:** ఎండు తెగులు ఐసీపీఎల్85063(లక్ష్మి విత్తనం) రకం తట్టుకుంటుంది. మాక్రోఫోమినా ఎండుతెగులు ఎంఆర్‌జీ 66, సూర్య (ఎంఆర్‌జీ 1004)రకాలు తట్టుకుంటాయి. ఎండు తెగులు వచ్చే ప్రాంతాల్లో ఇటువంటి రకాలనే వేయాలి. తెగులు ఎక్కువ ఉన్న పొలంలో వర్షపునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ట్రైకోడెర్మా విరిడి జీవ నియంత్రణ శిలీంద్ర పొడి మందు కిలో విత్తనానికి 10 గ్రాములు లేదా కార్బండిజం రెండు గ్రాములు కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేస్తే ఎండు తెగులును నివారించవచ్చు.

ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం

- నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్
- చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్



గ్రామ ప్రజల సమస్యలపై అధికారులతో మట్లాడుతున్న ఎమ్మెల్యే భాను ప్రకాష్, కలెక్టర్ సుమిత్‌కుమార్

నింద్ర: మండలం ప్రజల సమస్యలపై సత్వరం స్పందించి పరిష్కరించాలని నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథులుగా నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్, కలెక్టర్ సుమిత్ కుమార్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. రైతులకు రైతు భరోసా కేంద్రం ద్వారా 260 టన్నుల ఎరువులు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి తులసిరాం తెలిపారు. నాడు–నేడు ద్వారా 35 పాఠశాలల భవనాలు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసినట్లు ఎంఈవో శ్రీధర్‌రాజు తెలిపారు. ఉపాధి పథకం ద్వారా 35 మంది రైతులకు ఉద్యాన పంటలు సాగు చేసేలా చర్యలు తీసుకున్నట్లు ఉపాధి ఏపీవో తెలిపారు. కావునూరు గ్రామంలో తాగునీటి బోరు వేయాలని ఎంపీటీసీ విజేష్ కోరారు. మండలంలోని 9 గ్రామాల్లో రీ సర్వే పనులు పూర్తయినట్లు తహసీల్దార్ నాగమణి తెలిపారు. వైద్యాధికారి నిరోషా మట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు పరిసరాలు పరిశుభ్రతగా వుంచుకోవడం వలన జ్వరాలు ప్రబలకుండా నివారించవచ్చన్నారు. పాదిరి ఉప కేంద్రం భవనం నిర్మాణం చేసి పూర్తయినా బిల్లులు అందలేదని సర్పంచ్ సూర్య డిమాండ్ చేశారు. మండలంలోని కీళంబాకం గ్రామంలో తాగునీటి సమస్య నెలకొందని గ్రామ సర్పంచ్ లీలమ్మ తెలిపారు. గ్రామంలో అంగన్ కేంద్రం భవనం నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ వెంటనే పనులను పరిశీలించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కొప్పేడు దళితవాడ వద్ద విద్యుత్ తీగలు ఇండ్లపైకి వున్నందున ప్రజలు భయాందోళన చెందుతున్నారని ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, దుర్గాదేవి, తహసీల్దార్ నాగమణి, ఎంపీడీవో భవాని, హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు, ఏపీఎం చంద్రకళ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్‌కుమార్, కోఆప్షన్ సభ్యులు అనిల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓలు

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ తెలిపారు. బలిజకండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాల్లో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని వారు తనిఖీ చేశారు. ఒకటో తరగతి విద్యార్థులకు నిర్దేశించిన విద్యా ప్రవేశ్ కృత్యాలను పరిశీలించారు. విద్యార్థులతో చదివించడంతో పాటు రాయించడం, ధారాళంగా మాట్లాడడం నేర్పించాలని తెలిపారు. బడిఈడు పిల్లలు బడిలో ఉండేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, రుచి చూశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

ఈకేవైసీ కోసం పరుగులు



ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం ముందు బారులు తీరిన వినియోగదారులు

- 3 సిలిండర్ల ఉచితానికేనంటూ ప్రచారం
- ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్న మహిళలు

నగరి : తమ ఏజెన్సీలో వాస్తవ వినియోగదారులు ఉందరు ఉన్నారు. వారు లేకున్నా పాసుపుస్తకాలతో సిలిండర్లు ఎవరు కొనుగోలు చేస్తున్నారు. తదితర వివరాలు తెలుసుకోవడానికి గ్యాస్ ఏజెన్సీలు ఈకేవైసీ చేపట్టాయి. ఇందులో భాగంగా ఏజెన్సీ సిబ్బంది వినియోగదారుల ఇళ్ల వద్దకు వెళ్లినప్పుడు గ్యాస్ పుస్తకాలు, బాండ్లు ఆఫీసుకు తేవాలని, వేలి ముద్రలు పెట్టాలని చెప్పారు. ప్రభుత్వం మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడానికే ఈకేవైసీ చేస్తున్నారన్న ప్రచారం ఊపందుకోవడంతో జనం హెచ్‌పీ, ఇండేన్ గ్యాస్ ఏజెన్సీల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఈకేవైసీ చేసుకోకపోతే ప్రభుత్వం చెప్పినట్లు 3 సిలిండర్లు ఉచితంగా ఇవ్వరేమోనన్న భయం పట్టుకుంది. దీంతో ఎవరికి వారు గ్యాస్ పుస్తకాలు, బాండ్లు తీసుకొని ఏజెన్సీ కార్యాలయాల వద్దకు చేరుకుంటున్నారు. ఇతరుల పేరిట ఉన్న పాసుపుస్తకాలను తమ పేరిట మార్చుకునేందుకు కసరత్తు చేపట్టారు. మరోవైపు అందరూ ఒక్కసారికే వచ్చిపడడంతో సర్వర్ బిజీ కావడం, వేలిముద్రల సెన్సార్‌ల సమస్య రావడంతో ఏజెన్సీ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. నగరిలోని హెచ్‌పీ, ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలలో సుమారు 30 వేల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, ప్రస్తుతం పక్కాగా ఉన్నవేవో తెలుసుకోవడానికే ఈకేవైసీ చేస్తున్నట్టు కార్యాలయ నిర్వాహకులు తెలిపారు.

వారపు సంత వేలం పాట



ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న సర్పంచ్ సుబ్రమణ్యం, అధికారులు

గంగాధర నెల్లూరు: గ్రామ పంచాయతీకి చెందిన వారపు సంతను జీడీ నెల్లూరు మండల వైస్ ఎంపీపీ హరిబాబు వేలం పాటలో కైవసం చేసుకున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో రూ.3,79,500కు వైస్ ఎంపీపీ హరిబాబు వారపు సంతను కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీసీ సుబ్రహ్మణ్యం యాదవ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుధాకర్, ఈఓపీఆర్డీ రాఘవేంద్ర రాజు, పంచాయతీ కార్యదర్శి అంజద్ బాషా, రమేష్, జగదీష్ బాబు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యజ్ఞ పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

వెదురుకుప్పం: చవటగుంట ద్రౌపదీ దేవి ఆలయంలో జరుగుతున్న మహా భారత ఉత్సవాలలో భాగంగా యజ్ఞ పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతి రోజూ వేకువ జామునే సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకంతో పాటు ప్రత్యేకంగా అలంకరించి భక్తి ప్రపత్తులతో పూజలు చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం వైభవంగా యజ్ఞ పూజ చేశారు. మధ్యాహ్నం స్వర్ణలత హరికథా కాలక్షేపం చేపట్టారు. సాయంత్రం ఉత్తర గోగ్రహణం కార్యక్రమం ఆకట్టుకుంది. గురువారం రాత్రి కీచకవధ నాటక ప్రదర్శన అలరించింది. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాధారెడ్డి, వైఎస్ఆర్ సీపీ వైద్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలార్‌ప్రకాష్, రుయా అసిస్టెంట్ ప్రొఫెసర్ మీనాక్షి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడి వీధిలోని జైన్‌సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. ఉదయం7 నుంచి 10 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. అరవింద్ హాస్పిటల్ వైద్యులు కంటి పరీక్షలు చేసి, ఎంపికైనా వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తారని ఆయన పేర్కొన్నారు.

తగ్గిన భక్తుల రద్దీ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి భక్తుల రద్దీ తగ్గింది. వేసవి సెలవులు ముగియడంతో భక్తుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. శుక్రవారం 21,386 మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తుల తాకిడి అధికంగా లేకపోవడంతో భక్తులు స్వామిని సులభంగా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఆకస్మిక తనిఖీ





పీబీ అగ్రహారంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం, కడపగుంటలో విలేజ్ హెల్త్ క్లినిక్ తనిఖీ

గంగాధర నెల్లూరు: మండలంలోని వేల్కూరు పంచాయతీలో పీబీ అగ్రహారం, కడప గుంట గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఇంటింటి సర్వే నిర్వహిస్తూ గ్రామంలో ఎవరికైనా జ్వరం ఉంటే వెంటనే పరీక్షలు చేసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తాజా ఆహారాన్ని మాత్రమే వాడడం, భోజనానికి ముందు భోజనం తర్వాత, మలవిసర్జన తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు కడగడంపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి దుర్గాదేవి, సీహెచ్ఓ శ్రీనివాసులు, ఎస్‌యూఓ పీర్ సాహెబ్, ఎమ్‌ఎల్‌హెచ్‌పి సంధ్య, ఏఎన్ఎం అమరావతి, స్థానిక సచివాలయ సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం



కార్వేటినగరం: ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన సాయిలక్ష్మీదేవీ జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు శుక్రవారం శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి భక్తుడు ముందుకొచ్చి వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రతి శుక్రవారం, శనివారమే కాకుండా దాతల ఇష్టానుసారం రోజూ నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయిలక్ష్మీదేవీ కుటుంబ సభ్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధికూలీ రూ.275కు తగ్గకుండా చూడాలి



ఉపాధిహామీ పథకం పనులను పరిశీలిస్తున్న రాజశేఖర్



కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ రాజశేఖర్

పెనుమూరు(కార్వేటినగరం): ఉపాధి కూలీల వేతనం రోజుకు రూ.275కు తగ్గకుండా చూడాలని, ఉపాధి కూలీల సంఖ్యను మరింత పెంచాలని డ్వామా పీడీ ఎస్.రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గుత్తావాండ్లఊరు, కావూరు వారిపల్లి, రామకృష్ణాపురం పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా జరుగుతున్న పలు అభివృద్ధి పనులను చిత్తూరు క్లస్టర్ ఏపీడీ డాక్టర్ బండారు సుబ్రమణ్యంతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లో అమృత్ సరోవర్ పాండ్, ఫిష్‌పాండ్, ఫీడర్ కాలువలు నిర్మాణాలు చేపట్టడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. అలాగే ఉపాధి హామీ వేతనదారులతో ఆయన మాట్లాడుతూ గిట్టుబాటు కూలీలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. జూలై 1 నుంచి మండలంలో 3వేల మందికి ఉపాధిహామీ పథకం కింద పనులు కల్పించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. మండలంలో పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. 400 ఎకరాలలో పండ్ల తోటలు సాగు చేసేలా సన్న, చిన్న కారు రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు. అనంతరం ఉపాధిహామీ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి వెంకటేశ్వర్లు, అదనపు ప్రోగ్రాం అధికారి మీనాకుమారి, ఈసీ సతీష్, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

పండుఈగ బుట్టలతో మామిడికి రక్షణ



పండుఈగ బుట్టలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి సాగరిక

బంగారుపాళెం: మామిడి తోటల్లో పండుఈగ బుట్టలతో పంటను కాపాడుకోవాలని ఉద్యానశాఖ అధికారి సాగరిక సూచించారు. మండలంలోని మామిడితోటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. మామిడితోటల్లో నీలం రకం మామిడి కాయలను ప్రస్తుతం పండుఈగ వల్ల నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. పంట నష్టం జరగకుండా మామిడి తోటల్లో రైతులు పండుఈగ బుట్టలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది అంతంత మాత్రమే పంట వచ్చిందన్నారు. వచ్చిన పంటను పండుఈగ నుంచి కాపాడుకోవాలన్నారు. ఎకరాకు 6 నుంచి 8 పండు ఈగ బుట్టలను పెట్టుకోవాలని సూచించారు. బుట్టలోని చెక్కముక్కపై ఏదైనా పురుగుమందును 4 నుంచి 5 చుక్కలు వేయాలన్నారు. బుట్టలను భూమి నుంచి 3 నుంచి 4 అడుగుల ఎత్తులో కట్టుకోవాలని చెప్పారు.

అంగరంగ వైభవంగా పుష్పపల్లకి సేవ

- పుష్పపల్లకిలో భక్తులను కటాక్షించిన శ్రీరామచంద్రమూర్తి
- భక్తిప్రపత్తులతో స్వామికి ఊంజల్‌సేవ



భక్తిప్రపత్తులో స్వామికి ఊంజల్‌సేవ

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండరాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి పుష్పపల్లకి సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీపనైవేద్యం సమర్పించారు. అనంతరం ఉభయదారులు మోహన్‌రెడ్డి కుటుంబసభ్యులచే స్వామికి తిరుమంజనం, జయరామిరెడ్డి కుటుంబసభ్యుల నేతృత్వంలో స్వామికి పాలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిప్రపత్తులతో ఊంజల్ సేవ
కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం స్వామికి ఊంజల్‌సేవను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. స్వామికి పూజసామగ్రి, సుగంధపరిమళ పుష్పాలు, గజమాలలు, ప్రసాదాలు, ఫలాలను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అభిషేకం, సుగంధపరిమళ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. దీనికి ఉభయకర్తలుగా వెంకటపతినాయుడు వ్యవహరించారు.

వైభవంగా పుష్పపల్లకి సేవ
రాత్రి పుష్పపల్లకి సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామికి పూజాసామగ్రి, ప్రసాదాలు, పండ్లు, సుగంధపరిమళ పుష్పాలు, గజమాలలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులు సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, వేదమంత్ర పఠనంతో ధూపదీప నైవేద్య కైంకర్యాలను సమర్పించారు. సుగంధ పరిమళ పుష్పాలు, విద్యుద్దీపాలంకరణతో మెరుస్తున్న పుష్పపల్లకిలో కొలువైన శ్రీరామచంద్రమూర్తి మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉభయదారులుగా టి.పుత్తూరు యూత్ వ్యవహరించారు.

నేడు కల్పవృక్ష వాహన సేవ
బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంత్రం స్వామికి ఊంజల్‌సేవ, రాత్రి కల్పవృక్ష వాహన సేవను వైభవంగా నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్ధేశ్వర రెడ్డి, కార్యనిర్వాహకులు తెలిపారు.